శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి నన్ను గెలిపిస్తుంది

### రూప్ కుమార్ యాదవ్



**నెల్లూరు కార్పోరేషన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త :** 28వ తేదీ జరగబోవు మేయర్ ఎలక్షన్లో మేయర్ అభ్యర్థిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకులు మంత్రి లోకేష్‌బాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సార్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆశీస్సులతో మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. కార్పొరేషన్ పై అవగాహన కలిగిన వ్యక్తిగా కూటమి ప్రభుత్వ టిడిపి, బిజెపి, జనసేన నాయకులు ప్రజలు నన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రానికి 356 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 19.570 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 0, పెన్నా డెల్టా 0 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 88.144 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## జిల్లాలో పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

- కలెక్టర్ హిమాన్షు శుక్ల
- కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ ఏర్పాటు
- ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం కోసం ప్రజలు 0861 2331261 నంబర్‌ను సంప్రదించాలి
- ఎన్నికల నియమావళి అమలుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు
- ఎన్నికల విధుల నిర్వహణలో సమన్వయంతో పనిచేయాలి
- రాజకీయ ప్రకటనలకు నిబంధనల ప్రకారం ఎంసీఎంసీ ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, అక్టోబర్ 17, ప్రభాతవార్త – కలెక్టరేట్** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించి, ఎన్నికల పర్యవేక్షణకు నియమించిన వివిధ బృందాల విధులు, బాధ్యతలను సమీక్షించి పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదుల స్వీకరణ, సంబంధిత అధికారులతో సమన్వయం కోసం 24 గంటల పాటు పనిచేసే హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం కోసం ప్రజలు 08612331261 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఉల్లంఘనల గుర్తింపు, ఫిర్యాదుల పరిశీలన, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, మీడియా పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు (ఎస్ఎస్‌టీ), మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలు, ఫిర్యాదుల పరిష్కార బృందాలు తమకు కేటాయించిన విధులను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు, రాజకీయ పార్టీలు చేసే ఖర్చులను నిబంధనల ప్రకారం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల వ్యయ ఖాతాల నిర్వహణ, ఖర్చుల నమోదు, సంబంధిత లెక్కల పరిశీలనలో పారదర్శకత పాటించాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదు, వస్తువులు లేదా ఇతర ప్రలోభాలు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం అందితే సంబంధిత బృందాలు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెలివిజన్ ఛానళ్లు, వార్తాపత్రికలు, సోషల్ మీడియా వేదికలపై ప్రసారమయ్యే ఎన్నికల ప్రచారం, రాజకీయ ప్రకటనలు, సంబంధిత కథనాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రచార ప్రకటనల ప్రచురణ, ప్రసారానికి వర్తించే నిబంధనల ప్రకారం ఎంసీఎంసీ ముందస్తు ధ్రువీకరణ పొందాలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో మీడియా ద్వారా వెలువడే సమాచారాన్ని నిబంధనలకు అనుగుణంగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల విధులకు నియమించిన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను తప్పనిసరిగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలు, మీడియా పర్యవేక్షణ బృందాలు, ఇతర సంబంధిత విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అందిన ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తూ, ఎన్నికల నియమావళి ఉల్లంఘనల నివారణకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో నిర్లక్ష్యంకు తావులేకుండా, ప్రతి బృందం తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ లక్ష్మీనరసింహారావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మేయర్ స్థానానికి రెండు నామినేషన్లు

### టిడిపి ఒకటి, వైఎస్ఆర్‌సిపి ఒకటి





**నెల్లూరు కార్పోరేషన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికలకు సంబంధించి శనివారం ఉదయం నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లకు ప్రధాన పార్టీలు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ మేయర్ అభ్యర్థి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్‌యాదవ్‌లు రెండు నామినేషన్‌ల పత్రాలు అందజేశారు.

## బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా దొడ్ల విజయలక్ష్మీ నామినేషన్ దాఖలు





**బుచ్చి అక్టోబర్ 17 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ కూటమి అభ్యర్థిగా దొడ్ల విజయలక్ష్మీ ,కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా జరిగిన విలేఖర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు నాను రాక ముందు బుచ్చిరెడ్డిపాళెం నేను వచ్చాక బుచ్చిరెడ్డిపాళెంని ప్రజలు చూడాలని ఆమె కోరారు. మూడు వార్డులు బిజెపికి,మూడు వార్డులు జనసేనకు ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధికి,సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరిగిందని అన్నారు. ఈఎన్నికలలో దొడ్ల విజయలక్ష్మీ మంచి మెజార్టీతో గెలవబోతున్నారు, అలాగే కౌన్సిలర్లు అందరు గెలవబోతున్నారని ఆమె తెలిపారు. ప్రజలు కూడా కూటమి అభ్యర్థులకు పట్టం కట్టబోతున్నారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అనంతరం చైర్‌పర్సన్ అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మీ మాట్లాడుతు తమకుఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌కి, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కి,బిజెపి రాష్ట్ర అద్యక్షులు మాదవ్‌కి ప్రత్యేక ధన్యవాదాలన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రుణం తీర్చుకోలేనిదని అన్నారు.

వవ్వేరు బ్యాంకు చైర్మన్‌గా దొడ్ల కుటుంబానికి అవకాశం కల్పించారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం చైర్‌పర్సన్ అభ్యర్థత్వానికి నన్నుఎంపిక చేశారు. వారి రుణం తీర్చుకోలేదని అన్నారు. వారి నమ్మకానికి తగ్గట్టుగా నడుచుకుంటు బుచ్చిరెడ్డిపాళెం అభివృద్దికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్‌నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మాజీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, ఆర్యవైశ్యనాయకులు దర్శి మాలకొండయ్య, భువనేశ్వరం మురళీ, బెళ్ళం మల్లారెడ్డి, అందె ప్రత్యూషా, దుగ్గిశెట్టి హరినాద్, పలువురు టిడిపినాయకులు పాల్గొన్నారు.

## రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి

- పెయిడ్ న్యూస్‌పై నిరంతర పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, అక్టోబర్ 17, ప్రభాతవార్త – కలెక్టరేట్** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు రాజకీయ ప్రకటనలను ప్రచారం చేసుకునే ముందు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటయిందని, ఇందులో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ నందన్, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, బుచ్చిరెడ్డి పాలెం మున్సిపల్ కమిషనర్ చినబాబు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్ రెడ్డి మెంబర్లుగా ఉంటారన్నారు. ఎన్నికల సమయంలో ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాల్స్, బల్క్ ఎస్ఎంఎస్‌లు తదితర మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలను పర్యవేక్షించడంతో పాటు, పెయిడ్ న్యూస్‌పై కూడా ఎంసీఎంసీ కమిటీ నిఘా ఉంచుతుందని కలెక్టర్ తెలిపారు. టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఆడియో, వీడియో ప్రదర్శనలు, ఈపేపర్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు తదితర మాధ్యమాల ద్వారా రాజకీయ ప్రకటనలు ప్రచారం చేయాలనుకునే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనల ప్రకారం ముందస్తు ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఒక అభ్యర్థికి లేదా రాజకీయ పార్టీకి అనుకూలంగా వార్తల రూపంలో ప్రచురించే పెయిడ్ న్యూస్‌ను గుర్తించి, సంబంధిత నిబంధనల ప్రకారం పర్యవేక్షించే బాధ్యతను కూడా ఎంసీఎంసీ నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. రాజకీయ ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ, సంబంధిత అనుమతులు, పెయిడ్ న్యూస్ పర్యవేక్షణకు సంబంధించిన వివరాల కోసం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెల్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అందువల్ల, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ, రాజకీయ ప్రకటనల ప్రచారానికి అవసరమైన ముందస్తు ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ ప్రకటనల ధృవీకరణ కోసం సంబంధిత ప్రకటన ప్రసారం, ప్రచారం లేదా ప్రదర్శన ప్రారంభ తేదీకి కనీసం మూడు రోజుల ముందుగా నిర్దేశించిన ప్రొఫార్మాలో ఎంసిఎంసికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన అనుబంధం ఎ నమూనాలో దరఖాస్తుతో పాటు ప్రతిపాదిత ప్రకటనకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రూపంలోని రెండు కాపీలు, ధృవీకరించిన ట్రాన్స్‌క్రిప్ట్, ప్రకటన తయారీ ఖర్చు, ప్రసారం లేదా ప్రదర్శనకు అయ్యే అంచనా వ్యయం తదితర వివరాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రకటనలు ఎన్నికల చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఉండాలని, కమిటీ సూచించిన మార్పులు లేదా తొలగింపులను సంబంధిత రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్ణీత సమయంలో అమలు చేయాలని పేర్కొన్నారు. కమిటీ ధృవీకరణ పొందిన ప్రకటనలను పోలింగ్ ముగియడానికి నిర్ణయించిన సమయానికి ముందు 48 గంటల నిషేధిత కాలంలో ప్రచారం కోసం ఉపయోగించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు, అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు, మీడియా సంస్థలు రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## ఆత్మకూరు పట్టణంలో టిడిపి పార్టీ కార్యాలయం ప్రారంభం

- కూటమి అభ్యర్థులతో చర్చించిన మంత్రి ఆనం



**ఆత్మకూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలో టిడిపి కార్యాలయాన్ని శనివారం రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. అనంతరం మున్సిపాల్టీ ఎలక్షన్‌కు నామినేషన్ దాఖలు చేసే కూటమి అభ్యర్థులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని, టిడిపి, జనసేన, బిజెపి సమన్వయంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీకి కోట్లాది రూపాయల నిధులు కేటాయించామని, ఐదేళ్ళలో జరిగిన అభివృద్ధి కంటే రెండేళ్ళలో ఆత్మకూరులో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని, ఆత్మకూరు అభివృద్ధిని వైసిపినాయకులు అడ్డుకున్నారన్నారు. గతంలో వైసిపి నేతలు ఆత్మకూరుకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. వైసిపి నాయకులు వ్యక్తిగత స్వార్థంతో పాలనను అస్తవ్యస్తం చేశారన్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటిని కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. ఆత్మకూరును అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపడమే తమ లక్ష్యమన్నారు. అధిష్టానం నిర్ణయం మేరకు ఆత్మకూరు మున్సిపాల్టీ చైర్‌పర్సన్ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సరస్వతి దేవి అలంకరణలో శ్రీ కనకదుర్గ అమ్మవారు



**కావలి, అక్టోబర్17, ప్రభాతవార్త** కావలి భవానిపురం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నందు దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా శుక్రవారం అమ్మవారిని శ్రీ మూలా నక్షత్రం సరస్వతి దేవి అలంకరణతో గోనుగుంట భవాని ప్రసాద్ ల అలంకరించి పాగొండ మోహన్ స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అమ్మవారిని చూసేందుకు భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది. అమ్మవారిని చూసేందుకు ప్రజలు భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు కల్లపు మోహన్, కమిటీ సభ్యులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగింది.

## రిజర్వేషన్ల పేరుతో కూటమి ప్రభుత్వం బీసీలను మోసగిస్తోంది

- 2029లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం
- కిల్లి కృపారాణి



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్17, ప్రభాతవార్త** బీసీ రిజర్వేషన్ల విషయంలో కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో డ్రామాలకు తెరలేపిందని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ సెలక్షన్ కమిటీ అధ్యక్షురాలు కిల్లి కృపారాణి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆమె నెల్లూరు విచ్చేసిన సందర్భంగా ఇందిరా భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కోర్టుకు వెళ్ళగా రిజర్వేషన్ల అంశాన్ని కోర్టు కొట్టి వేసిందంటూ బీసీలపై చంద్రబాబు ప్రభుత్వం కపట ప్రేమ చూపుతుందన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే 34శాతం రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు బీసీలను ఎంతమందిని రాజ్యసభకు పంపారో, ఎంతమందికి ఎమ్మెల్సీ ఇచ్చారో, ఎంతమంది బీసీలను ఎంపీలుగా పార్లమెంట్‌లో కూర్చోబెట్టారో చెప్పాలన్నారు. 2004-2009లో వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో బీసీలకు 34శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ అమలు చేసిందని గుర్తు చేశారు. తనను స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పార్టీ సెలక్షన్ కమిటీకి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి నియమించిందని ఇందులో భాగంగా నెల్లూరు తిరుపతి శ్రీకాకుళం జిల్లాల ఎన్నికల వ్యవహారాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ దేశంలో సామాన్యులు ఎస్సీ, ఎస్టీ ప్రజానీకం స్వేచ్ఛగా బతకాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. 2029లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఏమి ఆశించి రాహుల్ గాంధీ ఎస్ఐఆర్‌పై రాజీలేని పోరాటం సాగిస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. ప్రజల కోసం పోరాటాలు సాగిస్తుంటే ప్రభుత్వం రాహుల్ గాంధీని, ప్రియాంక గాంధీని రోడ్లపై ఈడ్చుకెల్తోందని ఇది దారుణం అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కెల్లా నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి మరింత ఆదరణ పెరిగిందని, నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీలో ఉన్న ఆశావహులను చూస్తే పరిస్థితి అర్థమవుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీకి మేయర్ అభ్యర్థుల పోటీ కూడా ఎక్కువగా ఉండడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ 72 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థలో 72డివిజన్ల తో పాటు మేయర్ అభ్యర్థుల సంఖ్య ఎక్కువగానే ఉందని, ఈ రాత్రికే అభ్యర్థుల ఎంపికను పూర్తిచేసి ఒక్కరోజులోనే నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఆశావాహులను బట్టి కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ తెలుస్తుందన్నారు.

## లారీ ఆటో ఢీ డ్రైవర్ మృతి



**కోవూరు అక్టోబర్ 17 ప్రభాతవార్త** కోవూరు లోనే జాతీయ రహదారి ఎన్ ఎస్ ఆర్ కాలనీ వద్ద శనివారం ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఆటోడ్రైవర్ వెంకటసుబ్బయ్య తీవ్రగాయాలపాలై అక్కడక్కడ మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది హైదరాబాదు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీని నెల్లూరు నుంచి రాజుపాలెం వైపు వెళ్తున్న ఆటో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆటోను నడుపుతున్న వెంకటసుబ్బయ్య తీవ్ర గాయాల పాలై అక్కడక్కడ మృతి చెందాడు మృతుడు కోవూరులోని పెళ్ళాకూరు కాలనీ వ్యక్తిగాపోలీసులు గుర్తించారు సంఘటనా స్థలానికి కోవూరు పోలీసులు చేరుకుని మృద్దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట భద్రత

- నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను పరిశీలించిన ఎస్పీ



**నెల్లూరు క్రైం, అక్టోబర్ 17, ప్రభాతవార్త** పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే ధ్యేయంగా జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల నేతృత్వంలో పోలీసు యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. ఇందులో భాగంగా శనివారం నగరంలోని మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం, మోడల్ స్కూల్, భగత్ సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటైన నామినేషన్ కేంద్రాలను, అలాగే డీకే డబ్ల్యూ కళాశాలలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్, మొదటి అంతస్తులోని స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఎస్పీ స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ మొదలుకొని అక్టోబర్ 28న జరిగే పోలింగ్, అక్టోబర్ 30న వెలువడే ఎన్నికల ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలోనూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆమె ఆదేశించారు. ఎన్నికలను పూర్తిగా నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా బ్రహ్మాండమైన భద్రతా వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 72 వార్డులు, బుచ్చి మున్సిపాలిటీలోని 28 వార్డులు, ఆత్మకూరు మున్సిపాలిటీలోని 28 వార్డులు కలిపి మొత్తం 128 వార్డుల్లో ఎన్నికలు జరుగుతుండటంతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. నెల్లూరు కార్పొరేషన్‌లో 890 మంది, బుచ్చి, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో చెరో 150 మంది చొప్పున మొత్తం 1190 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని విధుల్లో మోహరించారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎంసీసీ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వార్డ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్, రూట్ మొబైల్స్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా 5 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. సాంకేతికతను జోడించి బాడీ ఓన్ కెమెరాలు, డ్రోన్లు, జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 5664 సీసీ కెమెరాల ద్వారా ప్రతి కదలికను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ అదనపు బలగాలతో నిఘా పెంచారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు నిబంధనలకు లోబడి పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

